# పసి(డి) మనసు

## ఆమధ్య మా వూళ్ళో జగద్గురువుల ఉపన్యాసాలు జరిగాయి.

ఒక రోజున వాళ్లమ్మా వాళ్లు వెళుతుంటే పాప కూడా వాళ్ల వెంటే వెళ్ళి ఉపన్యాసం విని వచ్చింది.

ఆ రోజు ఉపన్యాసంలో స్వామివారు మనలో అనేక మంది స్త్రీలలోనూ పురుషులలోనూ ఎంతెంతో భక్తి శ్రద్ధలు వుండి కూడా, మనలోని అవిజ్ఞత, అశ్రద్ధ కారణంగా మనం ఉపేక్ష చేస్తూండే విషయాల్ని ఎత్తి జ్ఞాపకంచేసి, "ఇవి ఎంతో ముఖ్య మైన విషయాలు–కొద్ది శ్రమతో ఎక్కువ ఫలితాన్ని సాధించే విషయాలు. అశ్రద్ధ చేయకండి" – అని ఉద్బోధించారు.

ఉపన్యాసం అయిపోయిన తర్వాత తాము నిత్యం చేస్తున్న తప్పల్ని స్వామి ఎత్తి చూపించి, తమకు జ్ఞానం ఉపదేశించినందుకు సంతోషిస్తూ, తమ అజ్ఞానానికి తమను తాము విమర్శించుకుంటూ, మళ్ళీ తమను తామే మన్నించుకుంటూ, నవ్వు కుంటూ–ఆడవాళ్ళంతా ఇళ్ళకు బయల్దేరారు.

స్వామివారి ఉపన్యాసం ఆడవాళ్ళ ముచ్చట్లు అన్నీ శ్రద్ధగా ఆలకించింది పాప.

ఆ మరునాడు ఆదివారం. ఉదయం తొమ్మిద వుతూంది. నేను దినపత్రిక చూస్తున్నాను. పాప కూడా నాతోపాటు ముందు గదిలో కూర్చుని హోమ్‌వర్కు లెక్కలు చేసుకుంటోంది.

కొంత సేపటికి శ్రీమతి లోపలి నుంచి వచ్చి ఒకసారి వీధి అరుగుమీదకు వెళ్ళడం, తిరిగి లోప లికి వెళ్ళడం గమనించాను.

వాళ్ళమ్మ లోపలికి వెళ్ళిన వెంటనే పాప బయ టికి వెళ్ళింది. కొంచెం సేపట్లో మళ్ళీ నా వద్దకు వచ్చింది.

"నాన్నా, నిన్న స్వామి వారు ఏం చెప్పారు నాన్నా?" అని అడిగింది.

"ఏం చెప్పారో నువ్వే చెప్ప. నువు కూడా విన్నా వుగా స్వామివారి ఉపన్యాసం!" అన్నాను.

"అయితే నిన్న ఉపన్యాసం దగ్గర నన్ను చూశావా నాన్నా నువ్వు?"

"ఓ! నిన్నూ, అమ్మనీ, అత్తయ్యనీ...మిమ్మల్నంద రినీ చూశాను!"

"నేను కూడా నిన్ను చూశాను నాన్నా! నువు దూరంగా కూర్చున్నావు. స్వామివారు ఉపన్యాసం చెపుతున్నపుడు గట్టిగా అరవకూడదని–నిన్ను పిల వకుండా ఊరుకున్నాను."

"నేను కూడా అందుకే నిన్ను పిలవకుండా ఊరుకున్నాను!" నవ్వుతూ ముద్దుగా పాప బుగ్గలు నొక్కుతూ అన్నాను.

పాప కూడా ఆనందంగా నవ్వింది. క్షణం ఆగి పాప మళ్ళీ నవ్వుతూ అడిగింది– "మరి స్వామి వారు నిన్న ఉపన్యాసంలో ఏం చెప్పారు నాన్నా?"

"ఏం చెప్పారో నువు చెప్పమ్మా! నువ్వూ విన్నా వుగదా!"

"నేను విన్నానులే నాన్నా! స్వామివారు ఏం చెప్పారో నువ్వ చెప్ప నాన్నా" అంది మళ్ళీ.

"నేను సరిగా వినలేదమ్మా! ఏం చెప్పారో నువ్వే చెప్ప" అన్నాను.

"అయితే నువు స్వామి వారి ఉపన్యాసం వినకుండా అమ్మ వంకా, నా వంకా చూస్తూ కూర్చున్నావా?"

పాప నా మీద పెద్ద నేరారోపణ చేసేసింది. నేను గుక్క తిప్పకోలేక పోయాను.


పాప చేసిన పరీక్షలో నేను పూర్తిగా ఫెయిలై పోయాను! అయినా...పాప నాకీ పరీక్ష ఎందుకు పెట్టిందో... తెలుసుకోవాలనే కుతూహలం బలంగా కలిగింది నాలో. పైగా... స్వామివారి ఉప న్యాసం తాను ఎంత వరకూ విన్నదో! అదీ తెలుసుకోవాలనే కోరిక కూడా కలిగింది.

"నిజమేనమ్మా! నిన్నూ అమ్మనీ చూస్తూనే కూర్చు న్నాను. ఉపన్యాసం నేను సరిగా విననే లేదు" అన్నాను నవ్వుతూ తప్ప ఒప్పకుంటున్నట్టు. పాప కూడా నవ్వుతూనే నా మాటకు అడ్డు వచ్చింది. "కాదులే నాన్నా! నువ్వూ ఉపన్యాసం శ్రద్ధగానే విన్నావు! నేను చూశాను. నాతో ఊరికే అలా చెపు తున్నావు!" పాప దగ్గర నా మోసపు పెద్దరికం తేలిపోయింది.

నేను అబద్ధాలు చెపుతున్నట్టు పాప తేల్చేసింది. "మరి నువు కూడా స్వామివారి ఉపన్యాసం అంతా విన్నావా?" అని అడిగాను.

"ఆ! నేనూ విన్నాను; అమ్మా, అత్తయ్యగారూ వాళ్ళూ కూడా విన్నారు" అన్నది పాప.

"ఊఁ! అయితే మరి స్వామివారు ఏం చెప్పారు



– కందికొండ సూర్యనారాయణశాస్త్రి

3-3-95 ఆంధ్రజ్యోతి వారపత్రిక

విశ్వవిజేత వస్తున్నాడు!

కొందరు యుద్ధోన్మాది అన్నారు
మరికొందరు మహావీరుడన్నారు
ఎవరేమన్నా అనుకున్నా
తాను విశ్వవిజేత కావాలనుకున్నాడు.
చరిత్రలో శాశ్వతం కావాలనుకున్నాడు.

ఎవరతను?

సికిందర్! సికిందర్!!

సికిందర్! సికిందర్!!

'గలగలా గోదారి'లా మళ్ళీ ప్రవహించనున్న

లల్లాదేవి 'సికిందర్' సీరియల్

త్వరలో


"నువ్వే చెప్ప నాన్నా!"

"పాపం మారాం చేస్తున్నదా?" అనిపించింది క్షణకాలం నాకు. కాని మా పాప మారాం చేసే రకం కాదు. ఇంకేదో కారణం వుండి వుంటుందని నిర్ధారణ చేసుకుని "అయితే మరి... నిన్ను నేను పరీక్ష చేయాలా? నువ్వు నన్ను పరీక్ష చేయాలా?" అని అడిగాను. మళ్ళీ నా పెద్దరికాన్ని నిలబెట్టుకుందామన్న తాపత్రయంతో.

"నువ్వే నన్ను పరీక్ష చెయ్యాలి!" పాప నవ్వుతూ ఒప్పకుంది.

"అయితే మరి స్వామివారు ఏమి చెప్పారో నువ్వే చెప్పు" అన్నాను.

"మరేమోనే...కూర చెక్కులూ...అరటి పళ్ళ తొక్కలూ...అలాంటివన్నీ కుళ్ళు కాలవల్లో పార బోస్తే నీళ్ళు పోకుండా నిలిచిపోయి దోమలు పెరుగుతాయి. అప్పుడు మీ కందరికీ మలేరియా జ్వరాలు వస్తాయి. అప్పుడు క్వైనా మాత్రలు మింగుతూంటే ఇంకా ఎక్కువ రోగాలు వస్తాయి! అందుచేతను మరేమోనే...కూర చెక్కులు అరటి పళ్ళ తొక్కలు ఆవుకి పెట్టండి... ఆవుకి పెడితే పేద వాడికి అన్నం పెడితే ఎంత సంతోషిస్తాడో అంత సంతోషం ఆవుకి కలుగుతుంది. అప్పుడేమో... అప్పుడేమోనే మీకు ఎంతో పుణ్యమొస్తుంది. అని చెప్పారు! ఏం నాన్నా! చెప్పారా లేదా?"

మధ్య మధ్యలో 'ఊ' 'ఊ' అనుకుంటూ జ్ఞాపకం చేసుకుంటూ–చిన్న చిన్న స్వామి వారి ఉపన్యాసం లోని సారాంశం చక్కగా చెప్పేసింది పాప! నాకు ఎంత ఆనందం కలిగిందో! అంత ఆనందంలో పాపకు నేనేమీ జవాబు చెప్పనే లేకపోయాను.

"చెప్ప నాన్నా! స్వామివారు ఇవన్నీ చెప్పారా లేదా?" పాప గారాబంగా నన్ను మళ్ళీ రెట్టించి అడిగింది.

"చెప్పారమ్మా!"

"మరి–స్వామివారు చెప్పిన మాటలు నువ్వూ నేనూ చక్కగా జ్ఞాపకం ఉంచుకున్నాం కదూ నాన్నా!"

"ఔనమ్మా! మనం చక్కగా జ్ఞాపకం ఉంచుకున్నాం!" పాప జ్ఞాపక శక్తికి సంతోషిస్తూ అన్నాను–"ఎవరు మంచి మాటలు చెప్పినా ఇలాగే జ్ఞాపకం ఉంచుకోవాలి! మరిచిపోకూడదు సుమీ!"

"అమ్మ అప్పుడే మరిచిపోయింది నాన్నా!" అమ్మ మతిమరుపుకి సానుభూతి చూపుతున్నట్టుగా అన్నది పాప!

"ఏం? అమ్మని కూడా అడిగావా? చెప్పలేక పోయిందా?" నేను ఆసక్తితో అడిగాను.

"ఇలారా నాన్నా!" అని పాప నన్ను చేయి పట్టుకుని వీధి అరుగు మీదకు తీసుకు వెళ్ళి "అదిగో! చూడు నాన్నా!" అని చూపించింది.

అప్పుడే ఒక ఆవు అక్కడికి వచ్చింది. కాలవగట్టు మీద వున్న రెండు మూడు సొరకాయ చెక్కులు నెమ్మదిగా ఏరుకు తిన్నది. కాలవలో ఇంకా చాలా సొరకాయ చెక్కులు పడి వున్నాయి. వాటి వైపు మూతి చాచింది. కాని మురుగు కాలవ దుర్గంధం వల్ల వాటిని తాకకుండానే వెళ్ళిపోయింది.

ఇప్పటికి నాకు అర్థమయింది. నిన్న సాయంత్రం స్వామివారి ఉపన్యాసం విని వచ్చిన శ్రీమతి అప్పుడే ఆ విషయాలపట్ల ఉపేక్షగా వ్యవహరిస్తోంది. ఏడేళ్ళ వయసున్న పాప ఎవరు ఏ మంచి మాట చెప్పినా శ్రద్ధగా ఆచరిస్తుంది. అంతకు అయిదు రెట్లు వయసున్న శ్రీమతి ఎవరు ఏ మంచి మాట చెప్పినా అశ్రద్ధగా తోసిపారేస్తూంది.

అంతలోనే పాప నా ఆలోచనా ధోరణికి అడ్డు పడింది. "పాపం, అమ్మ మరిచిపోయింది నాన్నా! గబగబా పనులన్నీ చేసుకోవాలి కదూ! అందుకని స్వామివారు చెప్పిన మాటలు అప్పుడే మరిచిపోయింది. నువు జ్ఞాపకం చేసి చెప్ప నాన్నా అమ్మకి!"

నా తప్పులనూ, బాధ్యతనూ విస్మరించి, ఇతరులపై నెట్టడానికి అలవాటైన నా మనసును కూడా మళ్ళించడానికి మంచిగా–ప్రేమగా–ప్రయత్నిస్తోంది.

లోకంలోగల పసి(డి) మనసులన్నీ ఏకాకారమై నా చిట్టితల్లిలోనే రూపుదాల్చినాయా–అనిపించింది. పాపను దగ్గరగా తీసుకుని కళ్ళలో నీళ్ళు తిరుగుతూండగా ముద్దుపెట్టుకున్నాను. ■